
# సుఖస్సాక్షాత్ పరబ్రహ్మ




చిల్లరంతా నేలమీద కుప్పగా పోసి ఉంది. విశ్వనాథం దానివేపు ఓసారి జాలిగా చూశాడు. బాధగా నిట్టూర్చాడు.

రెండు చేతుల్లోకీ ఇంత చిల్లర తీసుకుని నేల మీదికి ఓ ధారగా పోశాడు. చిల్లర డబ్బులు గలగల మంటూ నేలమీద దొర్లాయి. వింతగా ఉంది. మళ్లీ ఓసారి ఇంత చిల్లర పుచ్చుకుని నేలమీదికి పోశాడు.

విశ్వనాథం తనలో తనే అదోలా నవ్వుకున్నాడు. చిల్లరంతటినీ ఒళ్లో పోసుకుని తిరిగ్గా లెక్కపెట్టడం ప్రారంభించాడు. అరవైనాలుగు రూపాయలు పది పైసలున్నాయి.

విశ్వనాథానికి ఏడుపు రాబోయింది.

క్రింది పెదవిని మునిపళ్లతో బలంగా కొరుక్కుని రాబోతూన్న ఏడుపును ఆపుకున్నాడు. మగాళ్లు ఏడవటంకన్నా అసహ్యకరమయిన విషయం ప్రపంచంలో మరొకటి లేదని విశ్వనాథం నమ్మకం.

చిల్లర పోసుకునే సంచీ పక్కనే పడి ఉంది. దానివేపు చూశాడు విశ్వనాథం.

చిల్లర తీసేసిన సంచీ నొక్కులుపడిపోయి, జవసత్త్వాలు ఉడిగిపోయిన పండు ముదుసలిలా ఉంది.

ఒళ్లోఉన్న చిల్లరనంతా తిరిగి సంచీలోపోసి, సంచీ జేబులో వేసుకుని, ఓసారి దీర్ఘంగా నిట్టూర్చి లేచాడు విశ్వనాథం.

ఏడవకూడదనుకున్న విశ్వనాథానికి వెక్కిళ్లు వస్తున్నాయి.

ఆ రోజు ఉదయం ఏమయిందంటే,

"బసవరాజుకి పెందల నుంచి ఒంట్లో ఏమీ బాగుండ లేదు బాబుగారూ." ఉదయాన్నే గది ఊడుస్తూ యథాలాపంగా అంది తాయారు.

కాంపోజిషను పుస్తకాలు ముందువేసుకునికూర్చున్న విశ్వనాథం గతుక్కుమని తలఎత్తి చూశాడు. తాయారు తలవంచుకుని ఊడుచుకుపోతూంది.

"బసవరాజంటే ... పాలనరసయ్య కొడుకే కదూ?"

"అవును బాబూ!"

"పాపం! ఎప్పటినుంచేమిటి? ... ఇంతకీ జబ్బేమిటో నీకు తెలుసా?"

"అయ్యో మీకు తెలవదా బాబయ్యా? నిన్న మాపటేలకి ఎదవ బాగానే ఉన్నాడట. కాని, అదేం మాయరోగమోగానీ, ఇయాల పెందల నెగిసిన కాడి నుంచి ఒకటే నుట్టుకు పోతున్నాడు బతకడంటున్నారు సూసివచ్చినోళ్లంతాను."

తాయారు ఏవేవో చెబుతూంది. విశ్వనాథం వినిపించుకోవటం లేదు. అతని మనస్సంతా చికాకుగా తయారయింది.

విశ్వనాథం ఆలోచిస్తున్నాడు.

* * *

పంచాయతీ సమితి ఆధ్వర్యంలో నడపబడే ఓ పాఠశాలలో విశ్వనాథం సెకెండరీ గ్రేడు టీచరు.

నెలనెలా జీతం ఓ క్రమంలో వస్తే, పట్నంగాలి అంతగా సోకని ఆ చిన్నిఊళ్లో విశ్వనాథం జీవితం హాయిగా గడిచిపోయేదే!

కాని చిక్కు ఎక్కడ వచ్చిందంటే — ఆ ఊళ్లో కొన్ని రాబందులున్నాయి. ఆ రాబందులకొక ప్రెసి

డెంటు. ప్రెసిడెంటు పేరు వీరరాజు. సమితి ప్రెసిడెంటు వీరరాజు లక్షపతి బకాసురుడు.

తినవలసినంత తినగా, గుంజగలిగినంత గుంజగా, చేతికింది ఉద్యోగులని ఏడిపించగలిగినంత ఏడిపించగా, ఇంకా తృప్తిలేని మానవుడు, వీరరాజు!

వీరరాజు విలాసపురుషుడు.

గ్రామ సేవకులను తరుచుగా మారుస్తూ తన స్వార్థం తను చూసుకోగల సమర్థుడు.

వీరరాజుకి డబ్బుంది.

కావలసినంత బలగం ఉంది.

పీకవరకూ అహం ఉంది

నెత్తిమీద కళ్లున్నాయి.

కాబట్టి, ఆ పాఠశాలలో పనిచేస్తున్న (కర్మం అలా కాలి) ఉపాధ్యాయులకి జీతాలు అప్పుడప్పుడూ రెండు మూడు నెలలు బకాయిపడితే ఆశ్చర్య పడరనుకుంటాను.

ఎంత దిక్కుమాలిన చావు చచ్చినా, నక్క పీక్కు తినటం మాత్రం మానదు.

ఇక ప్రస్తుత విషయానికి వస్తాను.

వీరరాజు చేతి చలవవల్ల ఆ పాఠశాల ఉపాధ్యాయులకు గత నాలుగు నెలలుగా జీతాలు లేవు! ఇచ్చేదాతలేడు. అడిగే సాహసి లేడు.

మనుష్య జన్మ ఎత్తాక బతికితీరాలి.

కనీసం చచ్చేవరకూ బతకాలన్నా, పంచభక్ష్య పరమాన్నాలూ కాకున్నా నాలుగు మెతుకులన్నా కొరికి తీరాలి.

తిండి కావాలంటే ఏ నెల జీతాలు ఆ నెల ఎలాంటి అన్యాయాలూ జరగకుండా, బకాయిలు పడకుండా అందుతూ ఉండాలి.

ఈ విషయం విశ్వనాథానికి తెలుసును.

అతని భార్య ఎరుగును.

అతని ఆరుగురు పిల్లలు తెలుసుకున్నారు.

అంతే.

ఇంకెవరికి కావాలి ఈ విషయాలన్నీ?

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః"

విశ్వనాథానికి నవ్వు తెప్పించే సంస్కృత శ్లోకమేదయినా ఉందంటే ఇదొక్కటే.

ఇలాంటి పరిస్థితులలో, గుండెలమీద కూర్చున్న కుంపటిని నాలుగువేల అప్పుతో వదిలించుకున్నాడు టీచరు విశ్వనాథం.

ఇలాంటి పరిస్థితులలో, నాలుగు మెతుకుల కొరికి బ్రతకడానికి బోలెడు అప్పుచేశాడు టీచరు విశ్వనాథం.

ఇలాంటి పరిస్థితులలో, పాల నరసయ్యకి మూడు నెలల పాల సొమ్ము బకాయిపెట్టాడు టీచరు విశ్వనాథం.

చావకింది నీరుమాదిరిగా పెరిగింది బాకీ.

ఆమధ్య పేపర్లో, ఓ బ్రతకలేని బడిపంతులు కుటుంబంతో సహా ఆత్మహత్యకి పాల్పడ్డ వైనం చదివాడు విశ్వనాథం. మూడు నాలుగు నెలలుగా జీతాలు లేకున్నా తమకింకా ఆ స్థితి రానందుకు విశ్వనాథం తనని తనే అభినందించుకున్నాడు.

ఏదో అవాంతరం వచ్చినప్పుడెల్లా 'ఆశ' పీక నులిమి పారేసినా, తిరిగి దానికి ప్రాణంపోసి బ్రతికించడం మానవసహజం. ఆశ వచ్చినప్పుడల్లా మనిషిని నిరాశ ఆవరిస్తుంటుంది. అలాగ బ్రతికి బట్టలేని ఆశ, జీవచ్ఛవంలా మనిషి జీవితాంతం వెన్నంటి వస్తూనే వుంటుంది.

---

బసవరాజుకి జబ్బుచేసిందిట.

విశ్వనాథం నరసయ్యకి మూడు నెలల సొమ్ము బాకీ పడ్డాడు.

ఇప్పుడు నరసయ్య వచ్చి ఆ బాకీ మొత్తం ఒక్కసారి తెమ్మని కూర్చుంటే, అది అతని తప్పుకాదు.

సందర్భం అలాంటిది మరి!

ఒక్కగా నొక్కబిడ్డకి జబ్బుచేస్తే ఎక్కడలేని డబ్బూ సంపాదించి, తీసుకువచ్చి, డాక్టరుబాబుకి ధార పోసి వాణ్ణి రక్షించుకోవాలని ఏ కన్నతండ్రికి ఉండదు, ఆశ?

టీచరు విశ్వనాథం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

తన బాకీ తెమ్మని నరసయ్య ఇప్పుడేమీ అడగలేదు. అడగకపోతేమాత్రం, తనే పట్టుకువెళ్లి ఇవ్వకపోతే ఏం బావుంటుంది?

అతను వచ్చి "పంతులుగారూ, నా బాకీ ఇస్తేకాని వదలను. నా బసవన్నని దక్కించుకోవాలి" అని అడిగే వరకూ తను ఊరుకోవటం ఏం భావ్యం?

ఎలాగయినా నరసయ్యకి కనీసం రెండు మాసాల బాకీ అయినా సర్దాలి. నరసయ్య మంచివాడే. కాని అవసరం అతనిలోని మంచితనాన్ని మంటగలిపినా ఆశ్చర్య పడ నవసరం లేదు.

విశ్వనాథం తలుచుకుంటే ఆ బాకీ పూర్తిగా కాకపోయినా కొంచెమయినా ఓ విధంగా తీర్చెయ్యగలడు. ఆ తలుచుకోవటం మాటలతో జరిగేవనికాదు.

తలుచుకోవడానికి ముందుగుండెని రాయిచేసుకోవాలి. ఏడుపుని ఆవిరి చెయ్యాలి.

నైరాశ్యంలాంటి చీకటి గది అంతా వ్యాపించింది. చీకటిలాంటి నైరాశ్యం విశ్వనాథంమనసునిండా పులుముకొని ఉంది.

విశ్వనాథం నిశ్శబ్దంగా నిట్టూర్చాడు.

చిల్లరడబ్బులున్న సంచీ ఉన్న జేబు ఓసారి తడుముకొని లేచి నించున్నాడు.

టీచరు విశ్వనాథం అరవైనాలుగు రూపాయల పదిపైసలు కూడబెట్టడానికి ఓ కథ ఉంది.

దానికి ఓ కారణం ఉంది.

అదేమిటంటే ఇది.

* * *

విశ్వనాథం భార్య కామేశ్వరి. వివాహమయిన నాల్రోజులకి అడగక అడగక ఓ పట్టుచీర కొనిమ్మనికోరింది.

## పంతుల జోగారావు

విశ్వనాథం ఆ ముఖంలోనికి జాలిగా చూసి ఓ చిన్న నిట్టూర్పు విడిచినా, ఆమె మాట కాదనలేదు.

"సరే, కామేశ్వరీ!" అన్నాడు.

సెకండరీ గ్రేడు విశ్వనాథం "సరే కామేశ్వరీ!" అన్నాడు.

విశ్వనాథం ఆ మరునాడే పెట్టెలోనించి చిల్లర డబ్బులువేసి దాచుకునే సంచీ బయటికితీసి ఓంప్రథమంగా అందులో ఓ రూపాయి బిళ్ల వేశాడు.

ఆ రోజునుంచి అప్పుడప్పుడు ఎంతో కొంత ఆ సంచీలోవేస్తూ, డబ్బు నిలవచేసి, తన భార్య కోరిక తీర్చాలని నిశ్చయించుకున్నాడు.

విచిత్రం ఏమిటంటే, ఆ సంచీ పూర్తిగా నిండి, నెలలు నిండిన ఇల్లాలులా కలకలలాడే వేళకి, విశ్వనాథం కుటుంబానికి తంచనుగా ఏదో ఓ పెద్ద అవసరం వచ్చి పడేది.

డబ్బు నీళ్లలా వ్యయమయి, ముసలిమొహంలా సంచీ తయారయేది.

ఆశకి ప్రాణంపోస్తూ డబ్బు కూడబెట్టడం మళ్లీ ప్రారంభించేవాడు విశ్వనాథం.

నాలుగో సంతానం కలిగేవేళకి కామేశ్వరి పట్టుచీర సంగతి మరిచిపోయింది పూర్తిగా. విశ్వనాథం మాత్రం ఆశకి ప్రాణంపోస్తూనే ఉన్నాడు.

మూడోమారు ఏదో అవసరానికి విధిలేక ఆ సొమ్ము వాడేశాక, విశ్వనాథం ఈసారి ఆ సొమ్ము కూడబెడుతున్న సొమ్ము భార్య పట్టుచీర కొనటానికి తప్ప మరో దానికి ఖర్చుచెయ్యకూడదని దృఢంగా నిశ్చయించుకున్నాడు.

కాని,

ఆ సంచీ నాలుగోమారు మళ్లీ నిండేవేళకి బసవరాజుకి జబ్బుచేసింది.

విశ్వనాథం భోరున ఏడ్చాడు.

* * *

వెన్నెల కురుస్తున్న కంకర రోడ్డుమీద తలవంచుకుని జేబులో చిల్లర డబ్బున్న సంచీతో పాల నరసయ్య ఇంటికి నడుస్తున్నాడు విశ్వనాథం.

సెంటర్లోకి వచ్చేప్పటికి ఓ సైకిలు వేగంగా వచ్చి అతని పక్కన ఆగింది. వగురుస్తూ ఓ వ్యక్తి సైకిలు మీదినించి దిగి, "నమస్తే పంతులుగారూ! మీకోసమే వస్తున్నాను. వీరరాజుగారి మూడోవాడికి జబ్బుచేసింది. మిమ్మల్ని అర్జెంటుగా పట్నంపోయి ఈ మందులని పట్టుకురమ్మన్నారు. మీరు నుంచుంటే లాభం లేదు, మరి" అంటూ మందులపేర్లు వ్రాసి ఉన్న ఓ చీటీ, సైకిలు అతనికిచ్చాడు.

విశ్వనాథం యాంత్రికంగా వాటి నందుకున్నాడు.

"వెళ్లండి మరి, అవతల ప్రాణం పోయేను! మీ చేతి సొమ్ముతో తెస్తే మందులు తేగానే డబ్బు ఇచ్చేస్తానన్నారు ప్రెసిడెంటుగారు."

విశ్వనాథం మాట్లాడకుండా సైకిలు ఎక్కి పట్నంవేపు దారితీశాడు.

ముప్ఫయినాలుగు రూపాయలిచ్చి మందులుకొన్నాడు. లైటులేకుండా సైకిలు తొక్కినందుకు పట్నం పోలీసుల చేతిలో ఓ పదురూపాయల వరకూ పెట్టాడు. సోడాతాగి సైకిలెక్కి వచ్చి గ్రామం చేరాడు. మందులన్నీ

ప్రెసిడెంటు చేతుల్లో పోసి, 'మందులు తేగానే డబ్బు ఇచ్చేస్తానన్నారటగా?' అన్నట్టుగా నించున్నాడు.

ప్రెసిడెంటు ఆత్రతగా వాటి నందుకుని, "ధాంక్స్‌య్యా పంతులూ, డబ్బేంతయిందేమిటి వీటికి? సరేలే ఎంతయినా నేంగానీ, మళ్ళీ ఈ వారంనాడు కనబడు వీటికయిన సొమ్మిచ్చేస్తాను" అంటూ విసురుగా లోనికి వెళ్ళిపోయాడు.

ఇలా జరుగుతుందని ఊహించాడు కాబోలు, విశ్వనాథం మాట్లాడకుండా ఊరుకున్నాడు.

కాని, నరసయ్య ఊరుకుంటాడా?

విశ్వనాథానికి తనమీద తనకే జాలీ, చికాకూ, అసహ్యమూ వేశాయి.

ఛీ, ఛీ అనుకున్నాడు తనని తనే.

* * *

బసవరాజా చచ్చిపోయాడు.

నరసయ్య ఇల్లంతా పట్టి గోలగోలగా ఉంది.

దూరంలోనే ఆగి, నిశ్చేష్టుడయి నిలుచుండి పోయాడు విశ్వనాథం. ఆ కాళ్ళు మరి ముందుకు సాగలేదు.

'పంతులూ, నువ్వేనయ్యా నా బసవన్నని చంపుకు తిన్నది. నా బాకీ నా కివ్వటానికి దగ్గిర డబ్బుంచుకుని కూడా పొద్దల్లా ఆలోచించావు.

నువ్వాసొమ్మిస్తే పట్నంనుంచి ఖరీదయిన మందులు తెచ్చిపోసి, నా బసవన్నని దక్కించుకునేవాడినికదయ్యా?

నా కొడుకు పేణంకన్నా నీ పెళ్ళాం పట్టుచీర ఎక్కువ కదూ, నీకు?

ప్రెసిడెంటు వీర్రాజు నీకు ఏం మేలుచేస్తున్నాడని వాడి కొడుక్కి పట్నం మందులు కొనిచ్చావు?'

నరసయ్య ఎదురుగా నిల్చుని తనని కడిగేస్తున్నట్లుగా బాధపడ్డాడు విశ్వనాథం. అతని శరీరమంతా చెమటతో తడిసి ముద్దయింది. గొంతుకలో తడి ఆరి పోతూంది.

శవవాహకులని కుదుర్చుకోవటానికి వస్తూ, విశ్వనాథాన్ని చూసి ఏడుపు బిగబట్టుకున్నాడు నరసయ్య. విశ్వనాథం ప్రయత్నంమీద అతణ్ణి ఓదార్చేడు.

మందులకు పోసిన ముప్ఫయినాలుగు రూపాయలూ, పోలీసులకి ముట్టచెప్పిన ఐదురూపాయలూ పోనూ మిగిలినదంతా నరసయ్యచేతిలో ఉంచుతూ "నీ బాకీ నీకు సమయానికి తీర్చలేకపోయాను. నా కెంత బాధగా ఉందో చెప్పలేను. నా చేతగానితనానికి నాకే ఏడుపు వస్తూంది. ఇప్పటికయినా సగం సొమ్మమాత్రమే అతికష్టంమీద సర్దగలుగుతున్నాను. మారోలా అనుకోకు నరసయ్యా." నీరసంగా అంటున్నాడు విశ్వనాథం.

నరసయ్య గాభరాగా రెండు చేతులూ జోడించి, "అయ్యో, అలా అనకండి బాబయ్యా. చెమ్మదేవుడంటి వోళ్ళు తమరు. ఇప్పు డీ సొమ్ము ఇచ్చి తీరాలని నే నేమయినా పట్టుపట్టానా పంతులుగారూ?

అనుకునే వాణ్ణి కా న్నేను.

డబ్బుకు నాలుగు నెలలయి ఎంత ఇరకాటం పడకపోతే నాకు బకాయి పెడతారు తమరు? మీకు ఎప్పుడు వీలవుతే అప్పుడే ఇవ్వండి బాబూ!

నా ఎర్రి బసవడు పోనాడంటే అంతా నాకరమం, దాని కెవరేటి సేత్తారయ్యా?" అన్నాడు.

విశ్వనాథం కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి. ముఖం మరో ప్రక్కకి తిప్పేసుకున్నాడు. ★




స్ట్రెప్సిల్స్ మాత్రమే వాటిని కలిగించే క్రిములను చంపుతుంది — అతి వేగంగా

కారణమేమిటంటే, స్ట్రెప్సిల్సులో మాత్రమే రెండు బలమైన క్రిమినిరోధక మందులు ఉన్నాయి—ఒకటి, 2 4 డైక్లోరోబెన్‌జిల్ ఆల్కహాల్, రెండు, అమిల్ మెటా-క్రెసోల్. ఈ రెండింటిలో గొంతుక నొప్పిని కలిగించు క్రిములను త్వరగా చంపగలిగే శక్తి ఉంది. ఇంతకుముందు మీరు వాడినవేవియు ఇయ్యనంత త్వరగా ఉపశమనం కలిగిస్తుంది. వైద్యశాస్త్రీయంగా ఋజువు చేయబడిన స్ట్రెప్సిల్సు దగ్గర ఉంచుకోండి. అవి పిల్లలకు కూడా మంచివి.

స్ట్రెప్సిల్స్

క్రిమినిరోధక గొంతు బిళ్ళలు

గొంతుకనొప్పి, దగ్గులకు అతివేగంగా పనిచేయునవి వైద్యశాస్త్రీయంగా ఋజువు చేయబడినవి



A BOOTS RESEARCH PRODUCT

CMBS-1A TL